తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





# కష్టపడిన వారికి పార్టీలో పదవులు

**- ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్**





గూడూరు, జూలై 18 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీలో కష్టపడి పని చేసిన వారికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుర్తించి పార్టీలో పదవులు ఇవ్వడం జరుగుతుందని ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్ అన్నారు. శుక్రవారం గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ తానంక నానాజీల ఆధ్వర్యంలో సులూరుపేటలోని వారి నివాసంలో ఇటీవల చైర్మన్ పదవులు పొందిన తిప్పగుంటపాలెం పిఎసిఎస్ చైర్మన్ దూవూరు రాజశేఖర్ రెడ్డి, బోధనం పిఎసిఎస్ చైర్మన్ పెజయి ప్రవీణ్ కుమార్ రెడ్డి గూడూరు 24 సొసైటీ చైర్మన్‌గా అల్లూరు కరుణాకర్ రెడ్డి, గూడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిల్లకూరు నీరజమ్మతో పాటు గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాసిం సునీల్ కుమార్ నియోజకవర్గంలో నాయకులు గంగా ప్రసాదం కలిసి శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో పనిచేసిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత తానంకి నానాజీ, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, పెనుబోలు జానకిరామ్ రెడ్డి, ఓడూరు సత్యనారాయణ రెడ్డి, యశ్వంత్ పచ్చ వెంకటేశ్వర్ నాయుడు, మేకల కుమారు, కోట సతీష్, మునిశేఖర్, ఓబ్బాయి శివకుమార్, మరి కొంతమంది నాయకులు పాల్గొన్నారు.

# ఆ పాతిక మంది రాజకీయం...

# ఆగమ్యగోచరమే!

**-కూటమిలో చేరికకు కార్పొరేటర్లు పదినెలలుగా కలసిరాని కాలం**

**ప్రభాతవార్త-తిరుపతి:**
గెలిచిన పార్టీని కాదని ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమిపార్టీలో చేరేందుకు తిరుపతి నగరపాలక కౌన్సిల్‌లో మెజార్టీ కార్పొరేటర్లు పదినెలలుగా కుస్తీ పడుతున్నారు. ఇప్పటికీ మెజార్టీ ఉన్న 25మందికిపైగా పూర్వ వైసిపి కార్పొరేటర్లు ప్రస్తుతం స్తబ్ధుగా ఉన్న వీరంతా టిడిపిలో చేరేందుకు కాలం కలసిరావడం లేదు. దీనివెనుక బలమైన కారణం లేకపోలేదు. మరోఎనిమిదినెలల్లో ప్రస్తుత కౌన్సిల్ పదవీకాలం ముగిసిపోతుంది. ఆ తరువాత మళ్ళీ కొత్తగా జరిగే కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేయాల్సిందే. ఇప్పుడు ఉన్నపళంగా పార్టీ మారితే డివిజన్‌లలో నగర జనం ఆదరిస్తారా?అనే భయం కూడా అంతర్గతంగా వెంటాడుతోంది. 2021 మార్చిలో జరిగిన తిరుపతి నగరపాలక కౌన్సిల్ తొలి ఎన్నికల్లో 50 డివిజన్లకుగాను 7వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నిక ఆగిపోయింది.



గత నాలుగుసంవత్సరాలుగా ఈ ఎన్నిక జరగలేదు. ఏడాదిన్నర క్రిందట ఒక వైసిపి కార్పొరేటర్ మృతి చెందాడు. వైసిపి తరపున ఏకగ్రీవంగా ఎన్నికైన భూమన అభినయ్‌రెడ్డి ఉపమేయర్‌గా ఉంటూ గత ఏడాది ఎన్నికలకు ముందు రాజీనామా చేయడంతో ఆ కార్పొరేటర్ ఖాళీ అయ్యింది. ఉన్న 47మంది కార్పొరేటర్లలో ఒక టిడిపి కార్పొరేటర్, 46మంది వైసిపి కార్పొరేటర్లే, వీరిలో 5మంది వైసిపి కార్పొరేటర్లు గత ఏడాది అక్టోబర్‌లో జనసేనపార్టీలో కలసిపోయారు. మరో 8మంది వరకు కార్పొరేటర్లు కూటమికి మద్దతుగా కలసి తిరుగుతున్నారు. మిగిలిన 25మంది వరకు అంగబలం, ఆర్థిక బలం ఉన్న బలమైన కార్పొరేటర్లు ఇప్పుడు టిడిపి వైపు మొగ్గుచూపుతున్నా వారిని చేర్చుకోవడానికి సిఎం చంద్రబాబునాయుడు, యువనేత ,మంత్రి నారాలోకేశ్ విముఖత వ్యక్తం చేశారు. అంతేగాక జనబలం లేని ,గతంలో పలు రకాల ఇబ్బందులకు గురిచేసిన, తప్పులు చేసిన ,కొందరు అప్పట్లోనే టిడిపి నేతలు, కార్యకర్తలపై దాడులు చేయడం, దౌర్జన్యం దిగడం వంటి ఘటనలకు పాల్పడిన ఇతర పార్టీల నాయకులు ,కార్యకర్తలను టిడిపి చేర్చుకోదనే ప్రకటన చేసేయడంతో తిరుపతిలో 25మంది కార్పొరేటర్లు చేసేదిమీలేక నిస్తేజంగా ఉండిపోయారు. కార్పొరేటర్లుగా గెలిచిన పార్టీని వీడి అధికారంలో ఉన్న కూటమిపార్టీల్లోని టిడిపిలో చేరేందుకు ఆసక్తిచూపారు. అయితే వారి బలహీనతలు స్వాగతం పలకలేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో గత పదినెలలుగా వారంతా వేసుకున్న కండువా తీసేసి ఏ కండువా వేసుకోవాలనేది అయోమయంలోనే కొట్టుమిట్టాడుతున్నారు. అయినా టిడిపి మంత్రులు, జనసేనపార్టీ మంత్రులు వచ్చినా వారితో కలసి తిరగడం చేస్తున్నారు. వీరి భవిష్యత్తును తిరుపతి జనం నిర్ణయించనున్నారనేది హాట్‌టాపిక్‌గా మారింది. ఇదిలా ఉండగా రెండునెలల క్రిందట తిరుపతిలో నగరపాలకసంస్థ ఆస్తిని అమ్మేందుకు కౌన్సిల్‌లో అజెండాను వైసిపి కార్పొరేటర్లు మేయర్ శిరీషతోబాటు అన్నాఅనిత, నరసింహాచారి, ఎస్‌కె బాబు, ఖాదర్‌బాష, ఆదంరాధాకృష్ణారెడ్డి, మునిరామిరెడ్డి, ఆంజనేయులు, శాలినిరెడ్డి, ఉమాయాదవ్, గణేశ్, అమర్‌నాథ్‌రెడ్డి, సునీత, రామస్వామి వెంకటేశ్, తాజిన్, ఆదిలక్ష్మి,గీత, కోటేశ్వరమ్మ, అనిల్, శ్రావణి, కోఆప్షన్ సభ్యులు వెంకట్‌రెడ్డి, శ్రీదేవి, ఖాదర్‌బాషా,రాజేశ్వరి జనంవైపు నిలబడి ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించిన విషయం తెలిసిందే.

# ఎమ్మెల్యే భానుపై...మహిళా కమిషన్‌కు ఫిర్యాదు



పుత్తూరు, జూలై 18 ప్రభాతవార్త : కనీసం ఒక మహిళ అని కూడా చూడకుండా అసభ్య పదజాలంతో తనను ప్రజల్లో అపఖ్యాతి పాలు చేస్తున్న నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పర్యాటక, క్రీడల శాఖ మాజీ మంత్రి ఆర్.కె.రోజా రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజకు వాట్సాప్, ఇమెయిల్ ద్వారా రాత పూర్వకంగా ఫిర్యాదు అందించారు. కొంత కాలంగా ఉద్దేశ్యపూర్వకంగా తనపై వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. సినిమా హీరోయిన్‌గా, మాజీ మంత్రిగా ప్రజల్లో తనకున్న గుర్తింపును, గౌరవాన్ని నాశనం చేసేలా ఎమ్మెల్యే సత్యదూరమైన వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రాజకీయాల్లోకి రాక ముందే సినిమా నటిగా వున్నపుడే తాను చెన్నైలో ఇల్లు నిర్మించుకున్నానని అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ముందే హైదరాబాద్‌లో సొంత నివాసం ఏర్పరుచుకున్నానని తెలిపారు. ఇటీవల బహిరంగంగా రెండు వేలకు ఏ పనైనా చేస్తుంది, ఆ విధంగా రెండు వేల కోట్లు సంపాదించింది అని, గతంలో సంసారికి వ్యభిచారికి చాలా తేడా వుంది, గుర్తు పెట్టుకో, సంసారి అనుకోకు అని, హీరోయిన్‌కి తక్కువ వ్యాంప్ క్యారెక్టర్‌కు ఎక్కువ అంటూ ఇటువంటి నీచమైన పదాలతో ఒక మహిళగా తనకు ప్రజల్లో వన్న విశ్వసనీయతను దెబ్బతీసేలా ఎమ్మెల్యే భానుప్రకాశ్ మాట్లాడారని మహిళా కమిషన్‌కు దృష్టికి తీసుకువచ్చారు. సోషల్ మీడియాలో, ప్రజల్లో తనపై ఈ విధంగా దుష్ప్రచారం చేస్తూ ప్రజా జీవితంలో వున్న తనను మానసిక క్షోభకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుటుంబ సభ్యులు కూడా బాధపడుతున్నారని తెలిపారు. తన ఫిర్యాదును పరిశీలించి తగిన విచారణ చేసి ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## సిఎం చంద్రబాబు రాక!

**ఆరుగంటలు తిరుపతిలో పర్యటనలు**

తిరుపతి,జూలై 18ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంతజిల్లా లోని తిరుపతినగరంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనడానికి నేటి ఉదయం వస్తున్నారు. రోజంతా ఆయన ఉదయం 11గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ఆరుగంటలుపాటు తిరుపతిలో గడపనున్నారు.ఉదయం 11గంటలకు విమానాశ్రయం చేరుకుని 11.30గటంలకు తూకివాకం వద్ద నగరపాలకసంస్థ నిర్వహిస్తున్న ఘనవ్యర్థపదార్థాల కేంద్రం సందర్శిస్తారు. మధ్యాహ్నం 12గంటలకు రోడ్డుమార్గాన కపిలతీర్థం చేరుకుని కపిలేశ్వరస్వామిని దర్శించుకుంటారు. అక్కడే స్వచ్ఛాంధ్ర ప్రతినిధులతో సమావేశమవుతారు. అక్కడ నుండి ఎంఆర్‌పల్లిలోని ఏఆర్ పోలీసు మైదానంకు చేరుకుని ప్రజావేదిక నిర్వహిస్తారు. అనంతరం అలిపిరిలోని కంచికామకోటి పీఠం నిర్వహిస్తున్న మహామండపాన్ని సందర్శిస్తారు. ఇక్కడ మఠం వేదపండితుల నుండి ఆశీర్వచనం అందుకుంటారు. ఈ కార్యక్రమాలు అనంతరం రేణిగుంట విమానాశ్రయం చేరుకుని సాయంత్రం అమరావతికి తిరుగుప్రయాణమవుతారు.ఇ ప్పటికే సిఎం కార్యక్రమాల కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్ తిరుపతిలో ముఖ్యమంత్రి పర్యటనతో జిల్లా యంత్రాంగం జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, నగరపాలక కమిషనర్ మౌర్య, టిటిడి జెఇఒ వీరబ్రహ్మంతో కలసి రెవెన్యూ,పోలీసు అధికారులు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి అనగానిసత్యప్రసాద్ హాజరుకానున్నారు. కాగా నగరంలో డ్రైనేజీవ్యవస్థపై,రోడ్ల నిర్వహణపై ఆకస్మిక తనిఖీలు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

## సిఎం వస్తున్నారని..కపిలతీర్థం వద్ద టిటిడి పటిష్టభద్రత



తిరుమల,జూలై 18ప్రభాతవార్తప్రతినిధి: స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనడానికి శనివారం ఉదయం తిరుపతికి వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శైవాలయం కపిలతీర్థం లోని కపిలేశ్వరుని దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా కపిలతీర్థం పుష్కరిణి, జలపాతం,ఆక్కడ భక్తుల లగేజీలను భద్రపరిచే కౌంటర్లు, పరిసరాలు, పార్కింగ్ విషయాలపై శుక్రవారం సాయంత్రం టిటిడి ఈఓ శ్యామలరావు, జెఈఓ వీరబ్రహ్మం, సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, ఎస్ఇలు మనోహర్, వెంకటేశ్వర్లు, విఎస్ఓ సురేంద్ర,ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఆరోగ్యశాఖ డిప్యూటీ ఈఓ సోమన్‌నారాయణతో కలసి తనిఖీ చేశారు.

## సిఎం రాక సందర్భంగా ముందస్తు ఏర్పాట్లు

రేణిగుంట, జూలై 18 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జూలై 19వ తేదీ తిరుపతి జిల్లాలో జరిగే స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్న క్రమంలో జిల్లా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాలు పతిష్టమైన ఏర్పాట్లతో పాటు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నారు. ఏర్పాట్లన్నీ జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు సమీక్షిస్తున్నారు. ఉదయం రేణిగుంట ఎయిర్పోర్ట్ నుండి తిరుపతి వరకు ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, అడిషనల్ ఎస్పీ రవి మనోహర్ ఆచారి, రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు, జిల్లా ఉన్నత స్థాయి పోలీస్ అధికారులు, ముఖ్యమంత్రి ప్రత్యేక భద్రత అధికారులు ట్రైల్ రన్ రిహార్సిల్ నిర్వహించారు. కపిల తీర్థం నందు స్వచ్ఛఆంధ్ర ప్రతినిధులతో మాటామంతి లో పాల్గొంటారు. అటు పిమ్మట పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో ప్రజా వేదిక నందు మాట్లాడతారు. అనంతరం అలిపిరి కంచి కామ కోటి మహా మండపాన్ని సందర్శిస్తారు.



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

## ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలి



విమానాశ్రయంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి,కలెక్టర్ తదిరులు

రేణిగుంట జూలై 18 ప్రభాతవార్త రాష్ట్ర ముఖ్యమంత్రి తిరుపతి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు. ముఖ్యమంత్రి శనివారం తిరుపతి పర్యటనకు వస్తున్న నేపథ్యంలో శుక్రవారం రాత్రి జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్ రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, పలువురు పార్టీ నేతలు, అధికారులు కలిశారు. వీరంతా ముఖ్యమంత్రి పర్యటనపై చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి కోరారు.

# కోదమ సింహాల్లా... తిరగబడండి!

**-బాబు మోసాలపై స్పందించండి**
**-వైకాపా జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి**



సభలో మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి- పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి,జూలై 18 ప్రభాతవార్త: అధికారంకోసం అరచేతిలో స్వర్గం చూపిన చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌ల కూటమి ఏడాది అయినా హామీలు నెరవేర్చటంలో వైఫల్యం చెందారు, కొదమ సింహాల్లా తిరగబడండని వైకాపా జిల్లా అధ్యక్షుడు మాజీ ఎంఎల్ఏ కరుణాకర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం పట్టణంలోని సరస్వతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ సమావేశానికి ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు కూటమి ప్రభుత్వం పాలనపై ప్రజల మోసాలకు సంబంధించి శివమెత్తారు. ఈ సభలో అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శ్రీకాళహస్తికి చెందిన వినూత నా అడబిడ్డ అన్నావు, మరి నీ అడబిడ్డ జైలులో ఉంది, పవన్ నీవెక్కడున్నావ్, ఏం జరిగిందని ఎందుకు స్పందించరు. రాయుడు సోదరి ఆర్తనాదాలు నీకు వినిపించలేదా? మౌన మునిలా ఎందుకు మారావు? ఇందులో ఆంతర్యమేమిటి? అని కరుణాకర్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిసించారు.సిఎం చంద్రబాబునాయుడు పథకాల అమలులో విఫలమయ్యారు.

**మీరు రెడ్ బుక్ అన్నారు... నేను బ్లడ్‌బుక్ రాస్తా!**

మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నేడు ఆరాచక పాలన సాగుతుందన్నారు. అవినీతి, అక్రమాలకు నిలయంగా మారిందన్నారు. శ్రీకాళహస్తి మండలంలో ఎంపేడు గ్రామంలోని 40ఇళ్లు ధ్వంసం చేసారు. కొత్తకండ్రిగ గ్రామంలో 20 కుటుంబాలు గ్రామం వదలి వెళ్ళారు. గుర్తుపెట్టుకో సుధీర్ వడ్డీ కాదు చక్రవడ్డీతో తీర్చుకుంటాం, వైకాపా పాలనలో తాము ఎవరికి (తెలుగుదేశం కార్యకర్తకు) అన్యాయం చేయలేదు. మా కార్యకర్తలపై 247 మందిపై హత్యాయత్నం తప్పుడు కేసులు బనాయించారు.

ఎటిపి అంటే అంధ్రా తమిళనాడు పార్శల్ సర్వీసు అంటారు. ఇది శ్రీకాళహస్తిలో మొదలైందని మదుసూధనరెడ్డి అన్నారు. ముద్దపప్పు రెడ్ బుక్ రాస్తే తాను 'బ్లడ్ బుక్ డైరీ'రాస్తున్నాను 2029లో జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తాం. సుపరిపాలన అంటే ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కడమేనా? అని ఎంఎల్‌సి డాక్టర్‌సిపాయి సుబ్రమణ్యం ప్రశ్నించారు.

సొంత డబ్బులతో జనాన్ని రక్షించిన నాయకుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. కరోనా సమయంలో ప్రజల కష్టాలు తీర్చిన నాయకుడు మధుసూధనరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరుతారక శ్రీనివాసులు,వయ్యాల కృష్ణారెడ్డి, ఉన్నం వాసుదేవనాయుడు, బర్రెసుదర్శనం రెడ్డి, సిద్దాగుంట సుధాకర్‌రెడ్డి, జడ్‌పిటిసి సంధ్యారాణి ఎంపిపిలు నిర్మలమ్మ,కస్తూరి హరిప్రసాద్,మండల ఇన్‌చార్జిలు చెవిరెడ్డి మధుసూధనరెడ్డి, కోగిల సుబ్రమణ్యం, కూనాటి రమణయ్యయాదవ్, రమేష్,సిరాజ్‌బాషా, కోవి చంద్రయ్యనాయుడు, పఠాన్ ఫరీద్ శరవణ కుమార్, ఉదయ్‌కుమార్, మున్నా, బుల్లెట్ జయశ్యాం,సురేష్,పసల కృష్ణయ్య, శంకరయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానంలో అమలు

**- కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయుల ధర్నా**





ధర్నా నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

చిత్తూరు, జులై 18 ప్రభాతవార్త: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం అమలు తేదీ కంటే ముందే వెలువడిన నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగానికి ఎంపికై కొన్ని కారణాలతో ఆలస్యంగా విధుల్లో చేరిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని రాష్ట్ర ఎస్టీయు అసోసియేట్ అధ్యక్షులు గంటామోహన్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట శుక్రవారం డిఇఓ కార్యాలయం ఎదుట పలు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎస్టీయు నాయకులు మాట్లాడుతూ సిపిఎస్ అమలు తేదీ కంటే ముందే నోటిఫికేషన్ వెలువడిన, నోటిఫై చేసిన ఖాళీలకు ఎంపిక చేసి, ఇతరాత్ర కారణాలతో ఆలస్యంగా విధుల్లో చేరిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి వుందన్నారు. ఈ ఉత్తర్వులను అనుసరించి జిల్లాలో అర్హులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సిపిఎస్ 1 సెప్టెంబర్ 2004 నుండి అమలులో వుందని, ఈ తేదీ కంటే ముందే ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై వివిధ కారణాలతో రాష్ట్ర వ్యాప్తంగా విధుల్లో 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు చేరారని వీరందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో 2003 డిఎస్సీ టీచర్స్ ఫోరం కన్వీనర్స్ బి.మోహన్‌యాదవ్, ఢిల్లీ ప్రకాష్, వెంకటేష్, మధు, శ్రీధర్, కోదండరెడ్డి, మణిగండన్, రాష్ట్ర ఎస్టీయు అసోసియేట్ అధ్యక్షులు గంటామోహన్, రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ, రాష్ట్ర ఎపియుఎస్ఎస్ అధ్యక్షులు బాలాజీ, జిల్లా ఎస్టీయు అధ్యక్షులు మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్‌ను కలిసి ఉపాధ్యాయ సంఘాల నేతలు వినతిపత్రం అందజేశారు.

## శాకాంబరి అలంకారంతో దర్శనమిచ్చిన శ్రీచెంగాళమ్మ



శాకాంబరి అలంకారంలో శ్రీచెంగాళమ్మ

సూళ్లూరుపేట, జులై 18 ప్రభాతవార్త : శ్రీచెంగాళమాత పరమేశ్వరి దేవస్థానంలో ఆషాఢమాసం చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి శాకాంబరి అలంకారాన్ని చేశారు. ఆలయంలోని గర్భాలయం ముందు రకరకాల కూరగాయలు, పండ్లతో అత్యంత శోభాయమానంగా అలంకరించారు. ఆలయం లోపలి అమ్మణ్ణి మూలవిరాట్‌కు కూరగాయలు, పండ్లతో భక్తులకు కనువిందు చేసేలా అమ్మవారిని అలంకరించారు. పెద్దసంఖ్యలో శాకాంబరి అలంకారంతో దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు అమ్మణ్ణికి సారె సమర్పించారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అమ్మణ్ణిని దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు. అమ్మవారికి వేదపండితులు ప్రత్యేక హారతులు ఇవ్వడంతో పాటు సాయంత్రం అత్యంత శోభాయమానంగా పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, పి.మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిఇంటా ఆనందం... అదే చంద్రబాబు లక్ష్యం



తంగేళ్ళ పాళెంలో తొలి అడుగు కార్యక్రమం

తొట్టంబేడు,జూలై 18 ప్రభాతవార్త : శాశ్వత అభివృద్ధికి బ్రాండ్ చంద్రబాబు నాయుడు అని ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి అదే ఆయన లక్ష్యమని మాజీ శాసనసభ్యులు ఎస్‌సివి నాయుడు, సత్రవాడ మునిరామయ్యలు అన్నారు. శుక్రవారం తొట్టంబేడు మండలంలోని తంగేళ్ళ పాళెం, దళిత,గిరిజన వాడల్లో సుపరిపాలనలో ఏడాది తొలి అడుగు కార్యక్రమాలను మాజీ శాసనసభ్యులు పాల్గొని కూటమి ఏడాది పాలనలో చేపట్టిన ప్రగతిని వివరించారు. గత వైకాపా పాలకులు రాష్ట్రాన్ని అప్పుల పాల్జేస్తే కూటమి నాయకులు చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌లు ప్రగతి వైపు పయనింపజేస్తున్నారని వివరించారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి ఢిల్లికి తనమీద ఉన్న కేసులు కోర్టుల్లో విచారణకు రాకుండా కాపాడాలని ఢిల్లి పాలకుల కాళ్ళుమొక్కితే చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్‌లు తమరాష్ట్రాన్ని కాపాడాలంటూ పదే పదే ఢిల్లిలో ప్రధాని రెవెన్యూ, హోం శాఖ మంత్రులను అభ్యర్థిస్తున్నారన్నారు. జగన్‌మోహన్ తన సొంత పనులకు కోసం వెళితే చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రయోజనాల కోసం తిప్పలు పడుతున్నారన్నారు. వైకాపా పాలనలో జీతాలు ఎప్పుడు వస్తాయా? పెన్షన్లు ఎప్పటికి ఇస్తారా? అని ఉద్యోగులు ఎదురు చూసే వారు.కానీ ఏడాదిగా కూటమి నాయకులు 1వ తేది పొద్దుపొడవక ముందే పెన్షన్లు, ఉద్యోగులకు జీతాలు అందిస్తున్నారని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ప్రజలకు వివరించారు.రాష్ట్రం కోసం ఇద్దరు నాయకులు విశ్రాంతి లేకుండా కృషి చేస్తున్నారని వివరించారు.ఐదేళ్ళ పాటు పంచాయతీల అభివృద్ధి సర్పంచ్‌లను గాలి వదలిపెట్టారని అయితే ఏడదిగా సర్పంచ్‌లకు నిధులతో పాటు సర్వాధికారాలు అందించారని వివరించారు.ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ ఎస్ వి చెంచుకృష్ణమనాయుడు, దేశం నాయకులు ఎస్‌సివి దిలీప్,కిరణ్, ప్రకాష్‌నాయుడు, మోహన్‌నాయుడు, జి.భాస్కర్‌నాయుడు, అంజూరు సుధాకర్, నారాయణ యాదవ్, గాలి బాలాజి నాయుడు హరినాయుడు, అంజూరు రఘురాం, ఇర్ల కిషోర్, ఢిల్లి ప్రతాప్, సుదర్శనం నాయుడు, చందు,కయ్యూరి శివ, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవకుళామాత ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

**- టిటిడి చైర్మెన్ బి.ఆర్. నాయుడు**



తిరుపతిరూరల్, జూలై 18 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం పేరూరు బండపై వెలసిన శ్రీవకుళామాత ఆలయాన్ని శుక్రవారం టిటిడి చైర్మెన్ బి.ఆర్.నాయుడు సందర్శించారు. టిటిడి చైర్మెన్‌కు ప్రత్యేక పూజలతో శ్రీఅమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసారు. ఈ సందర్భంగా శ్రీవకుళామాత ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయుటకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. టిటిడి చైర్మెన్ భక్తులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీసారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు జి.భానుప్రకాష్‌రెడ్డి, ప్రత్యేక డిప్యూటీ ఇవో వరలక్ష్మీ, ఏఇవో గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే పులివర్తినానికి మాతృవియోగం

**చిత్తూరు, జులై 18 ప్రభాతవార్త:** చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి మాతృవియోగం కలిగింది. చిత్తూరు బివిరెడ్డి కాలనీలోని ఎమ్మెల్యే పులివర్తినాని స్వగృహంలో శుక్రవారం ఉదయం ఆయన తల్లి లక్ష్మీ భారతి మృతి చెందారు. గత కొంతకాలంలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మీభారతి శుక్రవారం తెల్లవారుజాము కన్నుమూశారు. తల్లి మృతి విషయం తెలిసిన ఎమ్మెల్యే పులివర్తినాని హుటాహుటిన చిత్తూరు చేరుకున్నారు. ఎమ్మెల్యే పులివర్తినాని తల్లి మృతి చెందడంతో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ తదితరులు సంతాపం తెలిపారు. చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, సీనియర్ తెలుగుదేశం నాయకులు కాజూరు బాలాజీ, జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, పలువురు కార్పొరేటర్లు లక్ష్మీభారతి మృతదేహంకు నివాళులు అర్పించి సంతాపం తెలిపారు.

## పలమనేరు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



**పలమనేరు,జులై 18 ప్రభాతవార్త:** పలమనేరు పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ మేరకు స్టేషన్‌లోని కేసుల రికార్డులను ఆయన పరిశీలించారు.పలమనేరు స్టేషన్ పరిధిలో ఉన్న సిబ్బంది వారి పనితీరు తదితర అంశాలపై ఆరా తీశారు.స్టేషన్ పరిధిలో ఉన్న కేసులు మరియు పెండింగ్ కేసుల వివరాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికై ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలు,తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలలో తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పలమనేరు డిఎస్పీ డేగల ప్రభాకర్,పలమనేరు అర్బన్ సిఐ నరసింహరాజు,ఎస్ఐ లోకేష్,సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన కమీషనర్

పలమనేరు,జులై 18 ప్రభాతవార్త: పలమనేరు మున్సిపల్ కమీషనర్ రమణా రెడ్డి పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ మేరకు పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉదయం నిర్వహిస్తున్న ఓపి సేవలు వాటి రిజిష్టర్లను,ఆసుపత్రిలోని వార్డుల పరిశుభ్రతలను ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు అక్కడి వైద్యులు అందిస్తున్న వైద్యం, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా మెప్మా సహకారంతో తక్కువ ధరలతో ప్రజలకు అందిస్తున్న జ్యూట్ బ్యాగుల విక్రయాన్ని పరిశీలించారు.మేనేజర్ ఖాదరు మొహిద్దీన్,మెప్మా సిఎంఎం బాబా,ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.



## కొత్తఇండ్లు నెల్లిపులి గంగమ్మ ఆలయంలో చోరీ

చౌడేపల్లి, జులై 18 ప్రభాతవార్త: మండలంలోని శెట్టిపేట పంచాయతీ కొత్తఇండ్లు నెల్లిపులి గంగమ్మ ఆలయంలో చోరీ జరిగింది. గ్రామానికి సమీపంలో గ్రామదేవత నెల్లిపులి గంగమ్మ ఆలయముంది. గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు గేటుతాళాలతోపాటు హుండీని పగులగొట్టి కొంతమేర నగదును దొంగలించారు. అంతే కాకుండా అమ్మవారి మెడలోని దాదాపు రూ. 20వేలు విలువ చేయు బంగారం నల్లపూసలదండను ఎత్తుకెళ్ళినట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా ఇప్పటి వరకు 4సార్లు ఇదే ఆలయంలో చోరీ జరిగింది.

## నాటుసారా కేసుల్లో తొమ్మిది మంది బైండోవర్



**కుప్పం, జులై 18 ప్రభాతవార్త :** ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కుప్పం మండలం దేవరాజపురం, రామ కుప్పం మండలం ఆరిమానుపెంట గ్రామాలకు చెందిన తొమ్మిది మందిపై తమిళనాడు, ఆంధ్ర ప్రాంతాల్లో ఎక్సైజ్ కేసులు నమోదైన నేపథ్యంలో వారిని శుక్ర వారం కుప్పం తహశీల్దార్ చిట్టిబాబు ఎదుట బైండో వర్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ నాగరాజ తెలిపారు. లక్ష రూపాయలు పూచీకత్తుతో వారిని బైండోవర్ చేశామన్నారు.దేవరాజపురంకు చెందిన ఏలుమలై, తంగం, ముత్తు, రామలింగం, అమ్ములు, తిరుమలై, మోహన్, కార్తీ, ఆరిమానుపెంటకు చెందిన చిరంజీవిలను బైండోవర్ చేశామన్నారు.ఎస్సై మోహన్‌బాబు, అన్వేష్,హెడ్‌కానిస్టేబుళ్లు చలపతి, ఎక్సైజ్ సిబ్బంది వెంకటేష్, పన్నీర్ నాయక్, రేఖ, పద్మ పాల్గొన్నారు.

## అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**కుప్పంరూరల్, జులై 18 ప్రభాతవార్త:** అంటు వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తపల్లి పిహెచ్‌సి వైద్యులు సుభాష్ రాజా సూచించారు. శుక్రవారం డెంగ్యూ మాసోత్సవం సందర్భంగా వేపనపల్లి గ్రామంలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. . కార్యక్రమంలో సిబ్బంది ముత్తుకుమార్, విష్ణుప్రియ, శివగామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పేదల పక్షపాతి సిఎం చంద్రబాబు : కంచర్ల



**శాంతిపురం, జులై 18 ప్రభాతవార్త :** పేదల పక్షపాతి సిఎం చంద్రబాబు నాయుడు అని ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం మండలం లోని బిఎం గొల్లపల్లి గ్రామంలో 72ఎకరాల డికెటి భూములకు సంబంధించి 82మంది రైతులకు పట్టాల పంపిణీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను నెరవేర్చుతూ సిఎం చంద్రబాబు మాట నిలుపుకుంటున్నారన్నారు. అప్పుల ఆంధ్రగా ఉన్న రాష్ట్రాన్ని ప్రగతి వైపు తీసుకెళ్తనా న్నరన్నారు. కుప్పానికి సైతం రైతుల కోసం అక్టోబర్ నెలకల్లా హంద్రీ-నీవా జలాలను తీసుకువస్తున్నారన్నారు.మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, పిఎసిఎస్ ఛైర్మన్ గోపాల్, చంద్ర, పెద్దన్న, నాగరాజు, వెంకటేష్, తహశీల్దార్ శివయ్య పాల్గొన్నారు.

## ఉపాధి బిల్లులు చెల్లించాలని ఎంపిడిఓకు వినతి



శాంతిపురం, జులై 18 ప్రభాతవార్త : ఉపాధిహామీ బిల్లులు చెల్లించాలని కూలీలు ఎంపిడిఓ పిఆర్ కుమార్‌ను కోరారు. శుక్రవారం ఎంకెపురం జనప చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపిడిఓ పరిశీలించారు. ఈసందర్భంగా కూలీలు మాట్లాడుతూ మూడు నెలలుగా బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. దీనిపై ఎంపిడిఓ స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## నేడు లయన్స్‌క్లబ్‌చే ఉచిత గుండె వైద్య శిబిరం

**శాంతిపురం, జులై 18 ప్రభాతవార్త:** స్థానిక నందిగం కళ్యాణ మండపంలో శనివారం బెంగళూరు వైదేహి ఆస్పత్రి బృందంచే ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈఅవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం



**రామకుప్పం, జులై 18 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపిపి ఆంజనేయరెడ్డి, జిల్లా నేత జయశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం రామకుప్పంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు గజేంద్ర, అల్లిశ్రీను, గంట్లరెడ్డి, గిరిదాసు, దయ, మంజునాథ్, నాగరాజు, సలామ్ పాల్గొన్నారు.

## ఘనంగా అర్జున తపస్మాను అధిరోహణ



**సదుం, జులై 18 ప్రభాతవార్త :** సదుం పంచాయతీ బట్టువారి పల్లె వద్ద పెద్దిరెడ్డి భాస్కరరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా శుక్రవారం సాయంత్రం అర్జునతపస్మాను అధిరోహణ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత మధ్యాహ్నం అర్జున గర్వభంగం అనే కథను హరికథ దాసు జోష్న భక్తులకు వినిపించారు. తపస్సు మాను నాటేందుకు ముందు పూజలు నిర్వహించారు.సాయంత్రం తపస్సు మానును అర్జున పాత్రధారి పద్యాలు పాడుతూ ఒక్కో మెట్టు ఎక్కారు. చివరిలో పూజలు చేసి కిందకు దిగారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉభయ దారులు పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, సదుం ఉప సర్పంచ్ బాబు రెడ్డి దంపతులు, జాండ్రపేటకు చెందిన మల్రెడ్డి దంపతులు వ్యవహరించారు. సోమల మార్కెట్ కమిటీమాజీ వైస్ చైర్మన్ శివా రెడ్డి, బోయకొండ ఆలయ మాజీ సభ్యుడు భాస్కర్ రెడ్డి, వైసీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, ఎండపల్లి మనోహర్ రెడ్డి, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

## కల్పవృక్షవాహనంపై విహరించిన కోదండరాముడు



**తవణంపల్లె, జులై 18 ప్రభాతవార్త:** మండలంలోని టి.పుత్తూరు గ్రామంలో వెలసిన శ్రీకోదండరాముల వారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీసీతా లక్ష్మణ సమేతుడైన కోదండ రాముడు కోరిన వరాలిచ్చే కల్పవృక్షవాహనంపై గ్రామ పురవీధులలో విహరిస్తూ భక్తులకు అబయహస్తం అందించారు. ఆలయంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా స్వామివారికి శుక్రవారం కల్పవృక్షవాహన సేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి దేవస్థానం వంశపారపర్యం ధర్మకర్త పి.సిద్దేశ్వరరెడ్డి, టి.పుత్తూరుకు చెందిన పి.వెంకటరమణారెడ్డి అండ్ సన్స్ ఉభయదారులుగా వ్యవహరించారు.

## అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

-పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్



**ఐరాల, జులై 18 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా శుక్రవారం సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమాన్ని మండలంలోని వైఎస్.గేట్, కామినాయనిపల్లె, కామినాయనిపల్లె ఎస్సీవాడ, కుల్లంపల్లె, కస్తూరినాయనిపల్లె, రత్నగిరి, చిన్నవెంకటంపల్లె ఎస్సీవాడ, మట్లపల్లె, చింత గుంపలపల్లె గ్రామాల్లో నిర్వహించారు. అలాగే ఆయా గ్రామాల్లో ప్రజల నుండి సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించారు. కామినాయనిపల్లె ఎస్సీవాడలో మూడు లక్షలు, కస్తూరినాయనిపల్లె గ్రామంలో ఐదు లక్షలు, కుల్లంపల్లెలో ఆరు లక్షలు, కామినాయనిపల్లెలో మూడు లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, పుత్రమద్ది నుండి కామినాయనిపల్లె వరకు 45 లక్షలు రూపాయల వ్యయంతో నిర్మించిన బిటి రోడ్డు ఎమ్మెలే మురళీమోహన్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఐరాల మండల టీడీపీ అధ్యక్షుడు గంగారపు హరిబాబు నాయుడు, మాజీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, ఐరాల జడ్పీటీసీ సుచిత్ర, మాజీ జడ్పీ టీసీ ఎం. లత, కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు,ఐరాల సింగిల్ విండో ఛైర్మన్ శేషాద్రి నాయుడు, మండలనాయకులుమోహననాయుడు,దేవాజీ,చంద్రశేఖర్‌రెడ్డి,పాటు పలువురు నాయ కులు పాల్గొన్నారు.

## పిఎఫ్ చెల్లింపులు వేగవంతంకు చర్యలు : జడ్పీ సిఇఓ



**చిత్తూరు, జులై 18 ప్రభాతవార్త:** భవిష్యనిధి రుణాలు, తుది మొత్తాల చెల్లింపులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటామని జడీప సిఇఓ రవికుమార్ నాయుడు అన్నారు. రాష్ట్ర ఎస్టీయు అసోసియేట్ అధ్యక్షులు గంటామోహన్ ఆధ్వర్యంలో ఎస్టీయు నాయకులు శుక్రవారం జడ్పీ కార్యాలయంలోని జడ్పీ సిఇఓ ఛాంబర్‌లో సిఇఓ రవికుమార్ నాయుడును కలిసి వినతిపత్రం సమర్పించి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జడ్పీ సిఇఓతో ఎస్టీయు నాయకులు మాట్లాడుతూ పదవి విరమణ చెందిన వారికి తుది మొత్తాలను చెల్లించడంలో జాప్యం జరుగుతుందని, జిపిఎఫ్ తరహాలో జడ్పీపిఎఫ్ ఖాతాదారులకు సైతం ప్రతి నెలా పిఎఫ్ చందాల జమకు సంబంధించి ఎస్ఎంఎస్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీయు అధ్యక్షులు మదన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోడే మోహన్, ఎస్టీయు నాయకులు లింగమూర్తి, చంద్రన్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సత్వరం టెన్త్ మూల్యంకనం రెమ్యునరేషన్ చెల్లింపు



**చిత్తూరు, జులై 18 ప్రభాతవార్త:** టెన్త్ పరీక్షల మూల్యాంకనంకు హాజరైన ఉపాధ్యాయులకు సత్వరం రెమ్యునరేషన్ చెల్లించాలని జిల్లా విద్యాశాఖ ఎడి వెంకటేశ్వరరావును మంగళవారం ఎస్టీయు నాయకులు కలిసి విన్నవించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఎడి వెంకటేశ్వరరావును శుక్రవారం ఎస్టీయు నాయకులు కలిసి మాట్లాడుతూ టెన్త్ పరీక్షలు పూర్తయిన మూడు నెలలు కావచ్చినా పేపర్లు దిద్దిన ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు రెమ్యునరేషన్ చెల్లించలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీయు అసోసియేట్ అధ్యక్షులు గంటామోహన్, జిల్లా ఎస్టీయు అధ్యక్షులు మదన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మోహన్‌యాదవ్, సంఘ నాయకులు లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## జీవరాశుల సంరక్షణతోనే పర్యావరణ సమతుల్యం



**చిత్తూరు, జులై 18 ప్రభాతవార్త:** జీవరాశుల పరిరక్షణతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుందని స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కబిలన్ అన్నాదురై పేర్కొన్నారు. చిత్తూరు అపోలో విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్స్ 1, 2 ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ డాల్ఫిన్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. హాజరైన స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కబిలన్ అన్నాదురై మాట్లాడుతూ డాల్ఫిన్‌ల మనుగడ సృష్టిలో సమతుల్యతకు సూచికగా నిలుస్తోందని, ఈ విషయంను యువత గుర్తించి బాధ్యతతో ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ డాక్టర్ రామయ్య ఇతుమల్లా, ఎన్ఎస్ ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ హేమాద్రిరెడ్డి, ఆఫీసర్లు షేక్ జాకీర్, గాయత్రి, వాలంటీర్లు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## మంగళగౌరీ వ్రతం నిర్వహించిన సికె లావణ్య



**చిత్తూరు, జులై 18 ప్రభాతవార్త:** తెలుగుదేశం సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే సికె బాబు సతీమణి ఆషాడమాసం శుక్రవారం పురస్కరించుకుని శుక్రవారం శ్రీపొన్నియమ్మన్ గుడిలో ఆగమోక్తకంగా మంగళగౌరీ వ్రతంను నిర్వహించారు. మంగళ గౌరీ వ్రతం పూర్తి చేసిన సికె లావణ్యబాబు అనంతరం భక్తులకు పసుపు కుంకుమలు పంపిణీ చేశారు. ఆషాడమాసం శుక్రవారం పురస్కరించుకుని ఆలయ ఆవరణలో సికె లావణ్యబాబు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీర్వచనం తీసుకున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నియోజకవర్గ సమస్యలపై మంత్రి లోకేష్ ఆరా



**చౌడేపల్లి, జులై 18 ప్రభాతవార్త:** తేదేపా జాతీయ కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను హరిహరహ సుమదీశ్వర అయ్యప్ప శ్రీసాయిరాం చారిటబుల్‌ట్రస్టు చైర్మన్, తేదేపా సీనియర్ నాయకుడు ఎస్.కె. వెంకట్రమణారెడ్డి కలిశారు. మంగళగిరిలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న సందర్భంగా కలసి పుంగనూరు నియోజకవర్గంలో రైతులు, ప్రజల సమస్యలను వివరించారు. అదే విధంగా నియోజకవర్గ పరిస్థితులపై మంత్రి నారా లోకేష్ ఆరా తీసినట్లు తెలిసింది. తేదేపా రైతు అధికార ప్రతినిధి సోమల సురేష్, జిల్లా సర్పంచుల సంఘ మాజీ అధ్యక్షుడు యదుశేఖర్‌నాయుడు,సీనియర్‌నాయకుడుకొండ్రెడ్డి లోకేష్‌నుకలసి పుష్పగుచ్ఛంతోపాటు రాత పుస్తకాలందించారు.

## గంగా భవానీకి రాహుకాలాభిషేకం



**బోయకొండ(చౌడేపల్లి), జులై 18 ప్రభాతవార్త:** శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు రాహుకాలాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. రాహుకాల సమయంలో దంపతుల సమక్షంలో వేద ఆలయ అర్చకులు, పండితులు గోవర్ధనశర్మల ఆధ్వర్యంలో జరిగిన అభిషేకం భక్తులను అలరించింది. పలమనేరు నవీన్‌కుమార్ అతని మిత్రబృందం అన్నదానానికి కూరగాయలను విరాళంగా అందించారు. ఆలయ ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం, అర్చక, అధికార, సిబ్బంది సేవలందించారు.

## బోయకొండలో అంబులెన్స్‌ను ఏర్పాటు చేయండి



**బోయకొండ(చౌడేపల్లి), జులై 18 ప్రభాతవార్త:** బోయకొండ శక్తిక్షేత్రంలో అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర బిసి ఐక్యవేదిక సంఘ నాయకులు ఆలయ ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరంను కోరారు. ఇటీవల తమ సమీప బంధువు కొండ ఎక్కుతూ గుండెపోటుకు గురయ్యాడనీ, వైద్యం కోసం వెళ్ళేందుకు ఎలాంటి వాహనం దొరకలేదన్నారు. వ్యయప్రయాసాలతో మదనపల్లికి వెళ్ళామన్నారు. ప్రస్తుతం అతను ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నాడన్నారు. అదే విధంగా ఏ భక్తుడూ బాధ పడరాదనీ, దేవస్థానం అంబులెన్స్ ఏర్పాటు చేసేందుకు తమ వంతు సాయం చేస్తామన్నారు. అనంతరం ఇఓకు వనితపత్రమందించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రనాయుడు, యువజన అధ్యక్షుడు ఆవుల విశ్వనాథ, నాయీబ్రాహ్మణఅధ్యక్షుడుసుబ్రమణ్యం, గంగులప్ప తదితరులు వినతిపత్రమందించిన వారిలో వున్నారు.

## ఒప్పంద అధ్యాపకుల కొనసాగింపు

**చిత్తూరురూరల్, జులై 18 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లాలో గత విద్యాసంవత్సరం 2024-25 పనిచేసిన ఒప్పంద అధ్యాపకుల పనికాలాన్ని 2025-26వరకు కొనసాగించినట్లు ఆంధ్రప్రదేశ్ కళాశాల సంచాలకులు ఒక ప్రకటన విడుదల చేసారని చిత్తూరు పివికెయన్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ నాగేంద్ర తెలిపారు. గత సంవత్సరంలో పనిచేసిన ఒప్పంద అధ్యాపకులు కొనసాగింపు కొరకు ధరఖాస్తులను పదోతరగతి సర్టిఫికేట్‌లతో జతపరచి సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌కు ఈనెల 19వ తేదీలోపు అందజేయాలన్నారు. జిల్లా పరిధిలోని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్ ఈ దరఖాస్తులను ఐడి కళాశాల ప్రిన్సిపాల్‌కు ఈనెల 21లోగా అందజేయాలని పేర్కొన్నారు.

## చౌడేశ్వరి దేవికి ఆడి శుక్రవార పూజలు

**పుంగనూరు, జులై 18 ప్రభాతవార్త :** మండలంలోని చదళ్లలో వెలసిన శ్రీ సప్తమాతృక సమేత చౌడేశ్వరి దేవికు శుక్రవారం ఆడి మాస పూజలు వైభవంగా జరిగాయి. ఆలయంలో వేదమంత్రోచ్చారణల నడుమ అభిషేకాలు నిర్వహించి అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ప్రతి శుక్రవారం వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపడుతున్నారు.

## నలుగురు అంతరాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

**పూతలపట్టు, జులై 18 ప్రభాతవార్త:** పూతలపట్టు మండలం, బండపల్లి గ్రామానికి చెందిన గంజాయి స్మగ్లర్ మోహన్ బాబు, అతని కుటుంబ సభ్యుల వద్ద నుండి గంజాయిని కొనుగోలు చేయడానికి తమిళనాడు రాష్ట్రం, వెల్లూరు జిల్లాకు చెందిన రమేష్, హరి కృష్ణమూర్తి, అంబూర్‌కు చెందిన ఆకాష్, హరిహరన్ అనే వ్యక్తులు అక్కడికి వచ్చారు. వారు బండపల్లి గ్రామానికి సమీపంలోని హట్సన్ డైరీ వద్ద ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి క్రింద ఉండగా, పోలీసులు అక్కడకు చేరుకుని ఈ నలుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 1.2 కిలోలు గంజాయి, మూడు ద్విచక్రవాహనాలు, కలిపి రూ. 3లక్షలా తొంబై వేలు విలువైన వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో అరెస్టయిన నలుగురు తమిళనాడు రాష్ట్రానికి చెందిన ముద్దాయిలు రమేష్, హరి కృష్ణమూర్తి, ఆకాష్ మరియు హరిహరన్‌లను రిమాండ్‌కు తరలించాం. ఇంకా పరారీలోఉన్నబండపల్లిగ్రామానికిచెందినమిగతాముద్దాయినిపట్టుకోవడానికిగాలింపుచర్యలు కొనసా గుతున్నాయి.



## సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



**సోమల, జులై 18ప్రభాతవార్త :** సోమల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మీటింగ్ హాల్లో జరిగింది. గంట ఆలస్యంగా 12:30 నిమిషాలకు సభ ప్రారంభమైంది. ఎంపీపీ ఈశ్వరయ్య అధ్యక్షతన సభ ప్రారంభించారు. ప్రజా ప్రతినిధులు తూతూ మంత్రంగా సభకు వచ్చారే గాని ప్రజా సమస్యలపై ఎవరు స్పందించకపోవడం విచారకరం. ఎంపీడీవో నారాయణ మండల పరిషత్ నిధులు ఎలా ఖర్చు చేశారు. ఇలాంటి అభివృద్ధి పనులు చేపట్టారు. అలాంటి విషయాలు చదివి వినిపించారు. అధికారులు మాత్రం తమ శాఖల పనితీరు గూర్చి వివరించి మమ అనిపించారు. సభలో అధికారులు ప్రజా ప్రతినిధులు చాలావరకు హాజరు కాకపోవడంతో కుర్చీలు ఖాళీగానే కనిపించాయి.

## ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



**కల్లూరు, జులై 18ప్రభాతవార్త :** జులై ప్రకృతి వ్యవసా యంతో నాణ్యమైన పంటలతో అధిక దిగుబడులు సాధించ వచ్చునని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాసు అన్నారు. పులిచెర్ల మండలం పాతపేట పంచాయితీలో రైతు రాజేంద్ర సాగు చేసిన నవధాన్యాల పంటను పరిశీలించారు. ఈ సంద ర్భంగా జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాసు మాట్లాడుతూ నవధా న్యాల సాగు అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొంద వచ్చునని రైతులు ఈ సాగుపై ఆసక్తి చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఎఫ్‌టిసి మాధవి, గురు ప్రసాద్, రమేష్, ముని చంద్ర, సుమిత్ర, రెడ్డి వాణి, రైతులు పాల్గొన్నారు.

## బస్సులోనుంచి జారిపడి వృద్ధుడు మృతి



**కుప్పం, జులై 18 ప్రభాతవార్త :** బస్టాప్ వచ్చేసిందని ఓ వృద్ధుడు బస్సులోనుంచి అదుపు తప్పి జారిపడి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. బండశెట్టిపల్లి గ్రామంకు చెందిన మునెప్ప (70) అనే వృద్ధుడు శుక్రవారం కుప్పంలో కెజిఎఫ్ వెళ్లే బస్సు ఎక్కాడు. చప్పిడి గరుగులు స్టాప్ వద్ద దిగాల్సి ఉండగా స్టాప్ వస్తుండగానే డోర్ వద్దకు వెళ్ళి అదుపు తప్పి కింద పడి మృతి చెందాడు. మృతదేహాన్ని పంచనామాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## విద్యార్థులచే చోరీ చేయించిన ఘనుడు



వి.కోట, జులై 18 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ల కోసం ఏర్పాటుచేసిన యుపిఎస్‌లను కాజేసే నేపథ్యంలో పాఠశాలలో చదివే విద్యార్థులచేత వాటిని చోరీ చేయించిన సంఘటన వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. మండలంలోని కోటనక్కనపల్లి జడ్పీ హైస్కూల్‌లో కంప్యూటర్ల కోసం యుపిఎస్‌లను ఏర్పాటుచేశారు. అయితే పత్రపల్లి సమీపంలో ఉన్న ఓ దుకాణదారుడు ఆ యుపిఎస్‌ల కోసం విద్యార్థులను ఎరగా వాడాడు. విద్యార్థులకు డబ్బు ఇస్తానని చెప్పి వారిచేత 11 యుపిఎస్‌లను చోరీ చేయించి తీసుకున్నాడు. విషయం గ్రామస్తులకు తెలియడంతో దుకాణదారుడ్ని నిలదీశారు. అయితే దుకాణదారుడు తమ అనుచరులతో తమపై తిరబడినట్లు గ్రామస్తులు వాపోయారు. సదరు దుకాణదారుడిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

## ఊసేలేని పీజీసెట్, ఎడ్సెట్ కౌన్సిలింగ్

తిరుపతి విద్య, జులై 18 ప్రభాతవార్త :

ఏపీపీజీసెట్,ఏపీఎడ్సెట్2025 ఫలితాలు విడుదలై దాదాపు నెలరోజులు గుడుస్తున్నా ఉన్నత విద్యామండలి కౌన్సిలింగ్ ప్రక్రియపై దృష్టి సారించకపోవడంపై విద్యార్థులు ఆందోళ వ్యక్తం చేస్తున్నారు. ఎస్వీయూ పరిధిలో ఏపీపీజీసెట్లో సుమారు 6వేల మంది విద్యార్థులు అర్హత సాధించి అడ్మిషన్ల ప్రక్రియ కోసం ఎదురు చూస్తున్నారు. అలాగే ఎడ్సెట్ పరీక్షలో 3వేల మంది విద్యార్థులు అర్హత సాధించి బీఈడీ అడ్మిషన్ల కోసం వేచిచూస్తున్నారు. కానీ ఇప్పటి వరకు ప్రవేశ ప్రక్రియపై అడుగు ముందుకు పడకపోవడంపై విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.

## ఘనంగా బెంట్లీ సిస్టమ్స్ ఇన్నోవేషన్ డే

తిరుపతి విద్య, జులై 18 ప్రభాతవార్త :

మౌలిక సదుపాయాల ఇంజనీరింగ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ అయిన బెంట్లీ సిస్టమ్స్, ఇన్కార్పొరేటెడ్ (నాస్‌డాక్: బి ఎస్ వై) ఇన్నోవేషన్ డే ను శుక్రవారం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమం, ప్రభుత్వ సంస్థలు, ఇంజనీరింగ్ సంస్థలు , మౌలిక సదుపాయాల కన్సల్టెన్సీల నుండి సీనియర్ నాయకులను ఒకచోట చేర్చడంతో పాటుగా డిజిటల్ ట్విన్స్ , ఓపెన్, ఇంటిగ్రేటెడ్ డిజిటల్ డెలివరీ వంటివి భారతదేశం మౌలిక సదుపాయాలను రూపొందించే, నిర్మించే, నిర్వహించే విధానాన్ని ఎలా మారుస్తున్నాయో అన్వేషించే అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో బెంట్లీ సిస్టమ్స్ దక్షిణాసియా ప్రాంతీయ కార్యనిర్వాహకుడు కమలకన్నన్ తిరువాడి మాట్లాడుతూ "ఇన్నోవేషన్ డే అనేది కేవలం ఒక కార్యక్రమం కాదు. ఇది మౌలిక సదుపాయాల భవిష్యత్తును రూపొందించే నాయకులను ఒకచోట చేర్చే వేదిక. డిజిటల్ డెలివరీలో భారతదేశం తన ఆశయాన్ని వ్యాప్తి చేస్తున్నప్పుడు, మౌలిక సదుపాయాలను మరింత తెలివైన, పరస్పరం అనుసంధానించబడిన , స్థిరంగా మార్చే సాంకేతికతల ద్వారా మద్దతు ఇవ్వడం పట్ల బెంట్లీ గర్వంగా ఉంది" అని అన్నారు. బెంట్లీలో సొల్యూషన్ ఆర్కిటెక్ట్ అభిషేక్ సిన్హా, డిజైన్ నుండి కార్యకలాపాల వరకు ఆధునిక మౌలిక సదుపాయాల సవాళ్లను బెంట్లీ ఎలా పరిష్కరిస్తుందో వివరిస్తూ కీలకోపన్యాసం చేశారు. అనంతరం పలు అంశాలపై సెషన్ లు జరిగాయి.ఈ కార్యక్రమంలో పలు సంస్థలు ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## శివయ్యసేవలో ప్రభుత్వ విప్

*శ్రీకాళహస్తి, జులై 18 ప్రభాతవార్త:*



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం ప్రభుత్వ చీఫ్ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ కుటుంబసభ్యులతో పూజలు చేయించుకున్నారు.వారికి ఆలయ మర్యాదలతో ఎఇఓ మోహన్, పిఆర్ఓ రవి,టెంపుల్ ఇన్సెపెక్టర్ వెంకటస్వామిలు స్వాగతం పలికారు.ఆయనకు స్వాగతం పలికిన వారిలో కుమార్,మహేష్, చిరంజీవి, సురేష్, లీలాధర్, పేట చిరంజీవి, మోహన్ తదితరులున్నారు.

## రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

**కుప్పంరూరల్, జులై 18 ప్రభాతవార్త:** సాయిమాతా సేవా ట్రస్ట్, బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈనెల 20వతేది కుప్పం బాలుర హైస్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు తెలిపారు. కంటి జబ్బులతో బాధపడేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9391833999నెంబరును సంప్రదించాలని కోరారు.

## రైతులకు విరివిగా సేవలందిస్తారు : ఏఎంసీ చైర్మన్



వెంకటగిరి, జూలై 18, ప్రభాతవార్తవ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు విరివిగా సేవలందిస్తారని నూతనంగా నియమితులైన ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథం తెలిపారు. విశ్వనాథం నుఏఎంసీ చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. రైతులకు గిట్టుబాటు ధర లభించే వరకు ఉత్పత్తులను గోదాముల్లో ఉంచేందుకు తగు ఏర్పాటు చేస్తానని తెలిపారు. మార్కెట్ కమిటీని అభివృద్ధి బాటలో నడిపించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తను పై ఉన్న నమ్మకం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఈ పదవి ఇచ్చారని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్టేషనరీ పంపిణీ



గూడూరు, జూలై 18 ప్రభాతవార్త: రోటరీ క్లబ్ గూడూరు ఆధ్వర్యంలో కీర్తిశేషులు కొణిదల ముని రామయ్య ఎనిమిదవ వర్ధంతిని పురస్కరించుకొని దివి పాలెం ఎంపీపీ స్కూల్ వారికి ఆరు స్టేషనరీ రాక్స్ అందించడం జరిగింది. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రిటైర్డ్ వి.వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా మా రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట గవర్నర్ మునిగిరేష్ వారి సోదరుడు ముని భాస్కర్, వారి తండ్రి కీర్తిశేషులు కొణిదల మునిరామయ్య జ్ఞాపకార్థం ఏదో ఒక సేవా కార్యక్రమం చేయడం ఆనవాయితీగా వస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు కుమార్, రోటరీ సభ్యులు ఎన్ బాలకృష్ణం రాజు, బివి శ్రీధర్, ఎన్.వి రత్నం, టి సురేష్ రెడ్డి, టీవీ రవికుమార్, జిజినాయుడు, పి.నిరంజన్‌రెడ్డి, ఎం.శ్రీధర్‌నాయుడు, పి.రవీంద్రారెడ్డి, ఎంసీ మల్లయ్య పాల్గొన్నారు.

## తపాలా కార్యాలయాల్లో ఐటీ 2.0 అప్లికేషన్

గూడూరు, జూలై 18 ప్రభాతవార్త: తపాల కార్యాలయాల్లో ఐటీ 2.0 అప్లికేషన్ విడుదల సందర్భంగా ఈనెల 21వ తేదీ వరకు తపాలా సేవల్లో అంతరాయం కలుగుతుందని, ఖాతాదారులు సహృదయంతో అర్థం చేసుకోవాలని గూడూరు ప్రధాన తపాలా కార్యాలయ సూపరిడెంట్ ఎల్.వి మురళీ కుమార్ కోరారు. ఈ పరివర్తనాత్మక చొరవలో బాగంగా అప్ గ్రేడ్ చేసిన వ్యవస్థ ఈ నెల 22వ తేదీ నుండి అన్నీ తపాలా కార్యాలయాల్లో అందుబాటులోకి వస్తుందని, మెరుగైన సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

## వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉండాలి



వాకాడు, జూలై 18 ప్రభాతవార్త: మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారిని దీప అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన వాకాడు వ్యవసాయ శాఖ కార్యాలయంలోని ఏ ఓ ఆధ్వర్యంలో కొత్తగా వచ్చిన వ్యవసాయ సయకులుతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడాతూ రైతు భరోసా కేంద్రాలకు వచ్చిన రైతులకు ప్రభుత్వ పథకాలను తెలియజయాలన్నారు. రైతులకు అందుబాటులో ఉండి వ్యవసాయ సలహాలు సూచనలు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయంలో వైద్య పరీక్షలు

వాకాడు, జూలై 18 ప్రభాతవార్త : మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలోని పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి శుక్రవారం వాకాడు వెల్నెస్ సెంటర్ వైద్య బృందంచే రక్త పరీక్షలు, బ్లడ్ ప్రెజర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య పరీక్షలో ఎంపీడీవో శ్రీనివాసులు, తహశీల్దార్ రామయ్య, రెవిన్ ఇన్స్పెక్టర్ అఖిల్, మండల పరిషత్ సిబ్బంది, తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది, ఇతరులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి ఓ శాలిని, ఏఎన్ఎం కొండమ్మ, ఆశ వాలంటీర్లు మణెమ్మ, నాగమ్మ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## నల్లబ్యాడ్జిలతో మున్సిపల్ కార్మికుల నిరసన

సూళ్లూరుపేట, జూలై 18 ప్రభాతవార్త: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, ఇంజినీరింగ్ కార్మికులు శుక్రవారం నల్ల బ్యాడ్జిలు ధరించి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరురోజులుగా ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె, మూడురోజులుగా పారిశుధ్య కార్మికుల కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రియాజ్, సాంబశివయ్య, చంద్రశేఖర్, పద్మనాభయ్య, అక్బర్‌బాషా, భాస్కర్, ఫయాజ్, ఖాన్, వెంకటరత్నం, రామయ్య, కరీం, మురళీ, బాబులు పాల్గొన్నారు.

## వాకాడు ఎంఎంసి ఛైర్‌పర్సన్‌గా ప్రమీల

కోట, జూలై 18 ప్రభాతవార్త: కోట బిట్-1 ఎంపిటిసి దారా సురేష్ సతీమణి మర్రి ప్రమీలకు ప్రభుత్వం వాకాడు ఏఎంసి ఛైర్‌పర్సన్‌గా నియమించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక గాంధీబొమ్మ సెంటర్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీకి విధేయతగా ఎంపిటిసి దారా సురేష్, ప్రమీల దంపతులు మూడు దశాబ్దాలకు పైగా క్రమశిక్షణగా ఉండే ప్రజాసేవ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాము జీవితాంతం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ రుణపడి ఉంటామని చెప్పారు. టిడిపి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు జలీల్‌అహ్మద్ మాట్లాడుతూ దారా సురేష్ కుటుంబానికి సముచిత గౌరవం లభించిందన్నారు. టిడిపి పట్ల వారి కుటుంబం విధేయతగా ఉండటమే ఇందుకు నిదర్శనమన్నారు.

## 30 ఏళ్ల తర్వాత కలిసిన మిత్ర బృందం



కోట, జులై 18 ప్రభాతవార్త: 30 సంవత్సరాల క్రితం ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు శుక్రవారం కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో సందడి చేశారు. తాము చదువుకున్న కళాశాలకు చేరుకున్నారు. పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి విచ్చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పూర్వ విద్యార్థులు అమెరికా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, కొలంబస్, సింగపూర్, ఇండియాలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్నతాధికారులుగా వివిధ విభాగాల్లో ఉంటున్న వారంతా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకటరమణ, వీరరాఘవులు, మధురిమ్ మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న ట్రెండ్ ఆధారంగా అధునాతన టెక్నాలజీని నేటి విద్యార్థులు చక్కగా ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్యూమినియం ఇన్‌ఛార్జ్ ప్రొఫెసర్ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## కూటమి ఏడాది పాలనలో ప్రజా వ్యతిరేకత : ఎంఎల్‌సి



కోట, జులై 18 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజావ్యతిరేకత స్పష్టంగా కనపడు తోందని ఎంఎల్‌సి మేరిగ మురళీధర్ అన్నారు. శుక్రవారం చిల్లకూరు మండలం తూర్పుకనుపూరుకు వెళుతూ ఆయన నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. గతంలో జగన్ మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని ఇంటింటికి వెళ్లి కార్యకర్తలు వివరించాలని కోరారు. ఆయన వెంట మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, సిద్దవరం సొసైటీ మాజీ ఛైర్మన్ సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి, సన్నారెడ్డి రమేష్‌రెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, శశిరెడ్డి, మండల జాయింట్ సెక్రటరీ పాముల సురేంద్ర తదితరులు ఉన్నారు.

## సూళ్లూరుపేట ఎంఎంసి ఛైర్మన్‌గా ఆకుతోట రమేష్



సూళ్లూరుపేట, జులై 18 ప్రభాతవార్త: వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ నూతన ఛైర్మన్‌గా ఆకుతోట రమేష్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడిగా ఉన్న ఆకుతోట రమేష్‌కు ప్రస్తుతం ఎఎంసి ఛైర్మన్‌గా నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ తనకంటూ రాజకీయాల్లో ప్రత్యేక శైలి ఏర్పరచుకున్న రమేష్ పంచాయతీ వార్డు సభ్యునిగాను, తెలుగు యువత అధ్యక్షునిగాను పనిచేశారు. పార్టీ అధిష్టానం రమేష్ సేవలను గుర్తించి పారిశ్రామికవేత్త గంగాప్రసాద్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం సూచనలతో ఎఎంసి ఛైర్మన్‌గా ఎంపిక చేశారు.

## ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ

వెంకటగిరి, జూలై 18 ప్రభాతవార్త డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ గుంటూరు డైరెక్టర్ విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ విజయవాడ వారి ఆదేశాల మేరకు విజిలెన్స్ మరియు వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు పురుగుమందులు చట్ట ప్రకారము అమ్మకాలు చేయుటకు ఈ తనిఖీలు నిర్వహించడం జరిగినది. వెంకటగిరి మండలంలోని, డివిజన్లోని విత్తనములు, ఎరువులు పురుగుమందులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో భాగంగా సరి అయిన ధ్రువపత్రాలు చూపనందువలన, బిల్లుల నందు పూర్తి వివరాలు నమోదు చేయకుండా రైతులకు బిల్లులు వేస్తున్నందున సంబంధిత రిజిస్టర్‌లలో పూర్తిస్థాయి వివరాలు నమోదు చేయనందువలన రూపాయల ఎరువులు లక్షల రూపాయల విలువగల పురుగుమందులు అమ్మకాలను నిలుపుదల చేయడమైనది. ఈ కార్యక్రమం నందు విజిలెన్స్ ఇన్స్పెక్టర్ నరసింహారావు, సహాయ వ్యవసాయ సంచాలకులు నంద్యాల వి. ఆంజనేయ, స్థానిక వ్యవసాయ సంచాలకులు పి. అనసూయ, వ్యవసాయ సిబ్బంది అయినా స్థానిక మండల వ్యవసాయ అధికారులు పి సుజాత, జి ప్రవీణ, పి శిరీష, అధికారులు పాల్గొన్నారు.

## 20న తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం

బాలాయపల్లి, జూలై 18 ప్రభాతవార్త : ఈనెల 20వ తేదీ వెంకటగిరి తిరుపతి రోడ్డులోని ఎస్ ఆర్ ఎల్ ఫంక్షన్ హాల్ నందు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, డీసీఎంఎస్ చైర్మన్ గంగోడు నాగేశ్వరరావు, రమణయ్య పాల్గొంటారని తెలిపారు.

## విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ

దొరవారి సత్రం జులై 18 ప్రభాతవార్త : దొరవారి సత్రం మండల పరిధిలోని పోలిరెడ్డి పాలెం గ్రామ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. సూళ్లూరుపేట లైన్స్ క్లబ్ ఆఫ్ షార్ వారి ఆధ్వర్యంలో క్లబ్ నెంబర్ హేమలత వారి మనవరాలు సంజన పుట్టినరోజు సందర్భంగా 60 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, స్టీల్ ప్లేటు, గ్లాసులు తదితర వస్తువులను అందజేశారు. అనంతరం మా సంస్థ ద్వారా పలు రకాల సేవలను అందిస్తున్నట్లు జిల్లా రీజన్ సెక్రెటరీ లయన్ ఆది శేషారెడ్డి, క్లబ్ ప్రెసిడెంట్ లలిత, సెక్రటరీ అరుణ, సభ్యులు అప్పారావు, అంకుల్, ఉపాధ్యాయులు ప్రసన్న, రమ తదితరులు పాల్గొన్నారు.

# నేడు తొట్టంబేడు మండల సమస్యల... సర్వ సభ్యసమావేశం

తొట్టంబేడు,జూలై 18 ప్రభాతవార్త : తొట్టంబేడు మండలంలో నాయకులకు కొదవ లేదు. కానీ ప్రజాసమస్యల పరిష్కారానికి దిక్కులేదు. గత పాలనలో ప్రజాప్రతినిధుల మాటకు విలువే లేదు, సర్పంచ్‌లకు అధికారాల్లేవు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సీన్ తిరిగింది. సర్పంచ్‌లకు అధికారాలొచ్చాయి, పంచాయతీలకు నిధులొచ్చాయి. పనులు చేయటానికి అవకాశం వచ్చింది.కానీ మండలంలో సమస్యలు కాపురం చేస్తున్నాయి. నేడు జరగనున్న సమావేశంలో అయినా ప్రజా సమస్యలపై ప్రజాప్రతినిధులు గళం విప్పుతారా? వేచి చూడాలి. తొట్టంబేడు మండలంలో 27 పంచాయతీలు ఇందులో సుమారు 50 గ్రామాలుంటాయి. అయితే ఈ మండలంలో అన్ని సమస్యలు పరిష్కరించే రెవెన్యూ కార్యాలయం తెలియని స్థితి అధికారులు సిబ్బంది దిన దిన గండంగా కాలం గడుపుతున్నారు.బతుకు జీవుడా అని విధి నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు అన్ని ఒకే చోట ఉండాలని నాటి మంత్రి హోదాలో గోపాలకృష్ణారెడ్డి ఏర్పాటు చేసారు.కానీ ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలు కాలం చెల్లి కూలటానికి సిద్ధంగా ఉన్నా నిధుల కొరత శాపంగా మారింది. మండలంలోని చేమూరు, చియ్యవరం,గుండెలు గుంటలలో మహిళలకు ఉపయోగపడే డ్వాక్రా మహిళా సంఘాల సొమ్ములను రెండేళ్ళ క్రితం సుమారు రు.4కోట్లకు పైగా సంఘమిత్రలు,సిసిలు దిగమింగారు. ఈ నిధులకు సంబంధించి సభ్యులు లబోదిబో మంటూ శివమెత్తారు.

తొట్టంబేడు మండలంలో కరెంటు సమస్యలు ప్రజల్ని, ఒర్రైతుల్ని వేధిస్తుంది. కరెంటు ఎప్పుడు వస్తుందో అంతుపట్టనిస్థితి ఇక కరెంటు బిల్లులు చూస్తే పట్టణం కన్నా అధికంగా వస్తున్నాయని వాపోతున్నారు. హైవే పక్కన ఉన్న సర్వీస్‌రోడ్లు ఆగమ్యగోచరంగా మారింది.గ్రామాలకు వెళ్ళాల్సిన సర్వీసురోడ్లపై పల్లెవెలుగు బస్సులు సాగటం లేదు. ఇక ఏ గ్రామంలో చూసినా మంచినీటి సమస్య, ఎక్కడా మురుగునీటి కాలువల్లేదు.మంచి రోడ్లు లేదు. ఈ సమావేశంలో అయినా సర్పంచ్‌లు సమస్యలపై గళం విప్పుతారా? లేదా? అనేది వేచి చూడాలి.

## శ్రీరామాలో విద్యార్థినిలకు అవగాహన సదస్సు



తిరుపతి విద్య,జూలై 18 ప్రభాతవార్త : స్థానిక కరకంబాడిరోడ్ లో ఉన్న శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజీలో కళాశాలకి చెందిన ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్,తిరుపతి కి చెందిన ఫెమి9 వారి ఆధ్వర్యంలో హార్మోన్ల మార్పు,ఆరోగ్య కరమైన జీవనశైలి అనే అంశం మీద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం కి ముఖ్య అతిథిగా ఫెమి9కి చెందిన అర్.అనంత్ హాజరై సభను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థినులు చదువుతో పాటు ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలి అని,శుభకరమైన ఆహారం,రోజు వ్యాయామం చేయడం ద్వారా హార్మోన్స్ సమతుల్యంగా ఉంటాయి అని తెలియచేసారు. ప్రిన్సిపాల్ డా.కె.జయచంద్ర మాట్లాడుతూ తమ కళాశాల లో చదువుతో పాటు,వ్యాయామం,యోగ లాంటి కార్యక్రమాలు చేస్తున్నాము అని తెలియచేసారు. ఈ కార్యక్రమం లో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్స్,మన్నెం రాముసుబ్బారెడ్డి, మన్నెం అరవింద కుమార్ రెడ్డి, ఉమెన్ ఎంపవర్మెంట్ కన్వీనర్ జి.చంద్రకళ,మహిళ సిబ్బంది, విద్యార్థిని లు పాల్గొన్నారు.

## తిరుచ్చిపై విహరించిన శ్రీ మహాలక్ష్మి



తిరుచానూరు, జూలై 18 ప్రభాతవార్త: తిరుచానూరులో పద్మావతి అమ్మవారు తిరుచ్చిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ప్రతి శుక్రవారం సేవలో భాగంగా పద్మావతి అమ్మవారిని సుప్రభాతంతో మేలు కొలుపు సహస్రనామార్చన నిత్య నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖమండపం వద్ద కల్యాణోత్సవం వైభవంగా చేపట్టారు. తరువాత అమ్మవారిని ఉద్యానవనంకు వేంచేపుగావించి వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దేవరాజులు, ఇంచార్జ్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఇన్స్పెక్టర్లు చలపతి, సుభాస్కర్, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణ క్యాంటీన్‌కు మోక్షం



తిరుమల,జూలై 18ప్రభాతవార్తప్రతినిధి: పలు కారణాలతో వినియోగంలోలేని విశ్రాంతి భవనాలు, హోటళ్ళ,క్యాంటీన్ల భవనాలను పూర్తిస్థాయిలో ఉపయోగం లోనికి తీసుకువచ్చేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు దృష్టి పెట్టారు. ప్రధాన కల్యాణకట్ట మార్గంలోని దశాబ్ధకాలంగా ఉపయోగంలో లేని అన్నపూర్ణక్యాంటీన్ భవనం స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించే ఆలోచన చేస్తున్నారు. శుక్రవారం ఉదయం టిటిడి ఈఓ జె.శ్యామల రావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,వసతి కల్పన డిప్యూటీ ఈఓ భాస్కర్, ఎఈఓ అశోక్‌కుమార్, సిఇ సత్యనారాయణ, సిపిఆర్‌ఓ డాక్టర్ తలారి రవితో కలసి అన్నపూర్ణక్యాంటీన్ భవనాన్ని, అన్నమయ్య భవనం సమీపంలోని హెచ్‌విడిసి, బాలాజీ నిలయం, తిరుమల మందిరం (ఆంప్రో విశ్రాంతి భవనం) విశ్రాంతి భవనాలను పరిశీలించారు.

## విద్యాసామగ్రి పంపిణీ



తొట్టంబేడు, జూలై 18 ప్రభాతవార్త: మండలంలోని విరూపాక్షపురంలో శుక్రవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యల్లంపాటి కోటేశ్వరబాబు విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. ఐదో తరగతి వరకు చదువుతున్న 575 మంది విద్యార్థినీ, విద్యార్థిలకు పలకలు, పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా కోటేశ్వరబాబు మాట్లాడుతూ తమ వంతు సమాజానికి సేవచేయాలని సంకల్పించాని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.పద్మావతి, ఉపాధ్యాయులు పి.శేఖర్, సి.భాస్కర్, ఏ.రాజ్‌కిరణ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రెండో పెళ్లి చేసుకుంటానని భర్త వేధింపులు

**-భర్తపై అలిగి నీళ్ల ట్యాంకు ఎక్కిన భార్య**



తిరుపతిరూరల్, జూలై 18 ప్రభాతవార్త: భర్త వేధింపులు తాళలేక వివాహిత త్రిష పెట్రోల్ క్యాన్‌తో నీళ్ల ట్యాంకు ఎక్కిన సంఘటన దుర్గసముద్రంలో చోటు చేసుకుంది. తిరుపతిరూరల్ మండలం దుర్గసముద్రం గ్రామ పంచాయతీలో ఓ వివాహితుడు అదనపు కట్నం తేవాలి...లేకుంటే రెండో పెళ్లి చేసుకుంటానని బెదిరించడంతో ఆమె పెట్రోల్ లీసుకుని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపారు. భర్త కావాలి...అత్త మామ, మరదులు నుంచి రక్షణ కల్పించాలని రక్షణ కల్పించాలని తిరుపతి రూరల్ మండల పోలీసులును కోరారు. తమకు రక్షణ కల్పించాలని తిరుపతిరూరల్ పోలీసులను కోరిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు.

## తిరుపతి ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి నా వంతు సహకారం

**- తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి వెల్లడి**



తిరుపతి హెల్త్ (కలెక్టరేట్), జూలై 18 ప్రభాతవార్త : తిరుపతి ప్రెస్‌క్లబ్ అభివృద్ధి నా వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని తుడా ఛైర్మన్,టీటీడీ బోర్డు మెంబరు డాలర్ దివాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్ కమిటీ విజ్ఞప్తి మేరకు శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌ను పరిశీలించారు. ప్రెస్‌క్లబ్ రీ మోడలింగ్‌లో భాగంగా ప్రెస్‌క్లబ్ భవనాన్ని సుందరంగా తయారు చేసేందుకు, అలాగే ప్రెస్‌క్లబ్ జర్నలిస్టు సోదరులకు అవసరమైన మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తాను ముందు ఉంటానన్నారు. నిద్రాహారాలు మాని 24 గంటలకు ప్రజా సేవలో పరితపించే జర్నలిస్టు సోదరులను అన్ని విధాలుగా ఆదుకుంటానన్నారు. అలాగే టీటీడీ, ప్రభుత్వం నుంచి అవసరమైతే ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి తిరుపతి ప్రెస్‌క్లబ్‌ను హైదరాబాద్‌సిటీ తరహాలో తయారు చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో ప్రెస్‌క్లబ్ కమిటీ నేతలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాలర్ దివాకర్‌రెడ్డిని అభినందించారు.

# గూడూరు డివిజన్

## కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు : కిలివేటి




పెళ్లకూరు, జూలై 18 ప్రభాతవార్త: మండలంలోని చిల్లకూరు వైయస్సార్సీపి మండల కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రీకాలింగ్ చంద్రబాబు మేని ఫెస్టో అంశంపై బాబు షూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమం ను సూళ్లూరు పేట నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యం లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మొదటగా ఎన్డిసిసిబి మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మనం ఈ ప్రభుత్వంలో అమలవుతున్న మోసపూరితమైన పథకాలు మన కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలు గురించి మాత్రమే మాట్లాడాలని వ్యక్తిగత విమర్శల జోలికి ఎవరు పోకూడదన్నారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ ఈ ప్రభుత్వంపై ప్రజల్లో అప్పుడే వ్యతిరేకత మొదలైందని త్వరలోనే ఈ ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెబుతాం న్నారు. ఎంపీటీసీలు పార్టీ కార్యకర్తలు ఎంపీపీ పోలం రెడ్డిశేఖర్ రెడ్డి జడ్పిటిసి నన్నం ప్రిస్కిల్లా సోమశేఖర్ రెడ్డి ఒబ్బు వెంకటరత్నం ఎల్లు మోహన్ కరణం రఘు నాయుడు పట్టూరు మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## లోకేష్ ను కలిసిన బిజెపి నేత



వాకాడు, జూలై 18 ప్రభాతవార్త: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను శుక్రవారం గూడూరు నియోజకవర్గ బిజెపి కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. గూడురు నియోజక వర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు, కూటమి ప్రభుత్వం అన్ని విధాల పేద బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటూ కూటమి నాయకులు పనిచేస్తున్నామన్నారు.

## విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ

దొరవారిసత్రం, జులై 18 ప్రభాతవార్త : దొరవారి సత్రం మండల పరిధిలోని పోలిరెడ్డి పాలెం గ్రామ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. సూళ్లూరుపేట లైన్స్ క్లబ్ ఆఫ్ షార్ వారి ఆధ్వర్యంలో క్లబ్ నెంబర్ హేమలత వారి మనవరాలు సంజన పుట్టినరోజు సందర్భంగా 60 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, స్టీల్ ప్లేటు, గ్లాసులు తదితర వస్తువులను అందజేశారు. అనంతరం మా సంస్థ ద్వారా పలు రకాల సేవలను అందిస్తున్నట్లు జిల్లా రీజన్ సెక్రెటరీ లయన్ ఆది శేషారెడ్డి, క్లబ్ ప్రెసిడెంట్ లలిత, సెక్రటరీ అరుణ, సభ్యులు అప్పారావు, అంకుల్, ఉపాధ్యాయులు ప్రసన్న, రమ తదితరులు పాల్గొన్నారు.

## స్వల్ప గాయాలతో బయటపడ్డ ప్రయాణికులు

చిల్లకూరు, జూలై 18 ప్రభాతవార్త: చిల్లకూరు పోలీస్ స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపై శుక్రవారం తిరుపతి నుండి జొన్నవాడకి దైవదర్శనానికి వెళుతున్న క్రమంలోముందు వెళ్తున్న కారుని వెనక నుండి ఢీకొన్న టిప్పర్ లారీ ఈ ప్రమాదంలో ఓ మహిళకు స్వల్ప గాయాలు కాగా మిగిలిన ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు విషయం తెలుసుకున్న చిల్లకూరు ఎస్సై సురేష్ బాబు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణం అయినా టిప్పర్ లారీని ఆదుపులోకి తీసుకోవడం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది.

## నేడు పేటలో స్వర్ణఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర



నాయుడుపేట, జూలై 18 ప్రభాతవార్త : నేడు నాయుడుపేటలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛఆంధ్రలో భాగంగా శనివారం అంబేద్కర్ భవనం నుండి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని కమిషనర్ పజులుల్లా తెలియజేశారు. ఈసందర్భంగా కమిషనర్ పజులుల్లా మాట్లడుతూ సింగిల్ యూస్ ప్లాస్టిక్‌పై ప్రజలకు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.ప్లాస్టిక్ కవర్లు వాడకం మానవజాతి మనుగడకు ముప్పు వాటెళ్ళుతుందన్నారు. ఈకార్యక్రమానికి అధికారులు అందరు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

## ప్రజలను అభివృద్ధి చేసేందుకే పి4

నాయుడుపేట, జూలై 18 ప్రభాతవార్త : గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో నివాసం ఉండే పేదప్రజలను గుర్తించి వారిని అన్నివిధాల అభివృద్ధి చేసేందుకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పి4ను తీసుకురావడం జరిగిందని మున్సిపాల్టి ఇన్‌చార్జి కమిషనర్ ఉరుకుందమ్మ తెలిపారు. మున్సిపాల్టి కార్యాలయంలో ఆమె ఆధ్వర్యంలో శంకరాపురం,గరిడివీధి ప్రజలకు గ్రామసభ నిర్వహించారు. ఈకార్యక్రమంలో మున్సిపాల్టి సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది : ప్రభుత్వ విప్



కుప్పం, జూలై 18 ప్రభాతవార్త : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధనకు ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అమరజీవి విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాజధాని అమరావతి నగరంలో అమరజీవి స్మృతివనం ఏర్పాటుకు 6.8 ఎకరాల స్థలాన్ని సిఎం చంద్రబాబు నాయుడు కేటాయించా రన్నారు. ఏడాది లోగా అక్కడ స్మృతివనం రూపుదిద్దుకుంటుందన్నారు. కార్యక్రమంలో కడ సభ్యులు బిఆర్ సురేష్‌బాబు, రాజ్‌కుమార్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, ఆర్యవైశ్య నాయకులు అజిత్ ఆనంద్, ప్రమోద్, గిరిధర్‌బాబు, రామూర్తి, పిఎస్ సతీష్, శేఖర్, దినకర్, రమేష్, కృష్ణమూర్తి, అమరేంద్ర, గోపి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## అంతరాయం లేని విద్యుత్ సరఫరానే లక్ష్యం

**- సమీక్షా సమావేశంలో సీఎండీ కె.సంతోషరావు**



తిరుపతి కలెక్టరేట్, జూలై 18 ప్రభాతవార్త : విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్‌ను సరఫరా చేయాలనే లక్ష్యంతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని ఏపీఎస్పీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు కోరారు. తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం సంస్థ అధికారులతో సీఎండీ కె.సంతోషరావు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది హెడ్ క్వార్టర్స్‌లోనే నివాసం ఉంటున్న వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలన్నారు. సంస్థ పరిధిలో పీఎం సూర్యఘర్ పథకంపై వినియోగదారులలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీ ఎల్ అధికారులు పాల్గొన్నారు.

## అరణ్యంలో ఆత్మహత్య..!



గంగవరం,జూలై 18, ప్రభాతవార్త : ఓ వృద్ధుడు అరణ్యంలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం సాయంత్రం మండలంలో వెలుగు చూసింది..స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. మండలంలోని మేలుమాయి పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన వెంకటప్ప అలియాస్ ఎర్రన్న(66) అనే వృద్ధుడు గ్రామ సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో మృతి చెందిన విషయాన్ని పశువుల కాపర్లు గుర్తించి గ్రామస్తులకు సమాచారం అదించారు. విషయం తెలుసుకున్న కొత్తూరు, మేలుమాయి, చిన్నమనాయనిపల్లె,యువకులు మృతదేహం కోసం దాదాపు మూడు గంటల పాటు సుమారు 5 కిలో మీటర్ల దూరం దట్టమైన అరణ్యంలో గాలింపు చర్యలు చేపట్టి చివరకు అటవీ ప్రాంతంలోని కొడవలి బండ,ఇరుకురాళ్ళ బావి సమీపంలో నాలుగు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తుంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలాన్ని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు మేరకు గంగవరం అర్బన్ సిఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతుడికి భార్య పిల్లలు కలరు.